కొత్త ఉద్యోగాలు సరే...

ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారు

- నేటి నుంచి ప్రభుత్వ మద్యం షాపులు రద్దు
- ప్రైవేట్‌కు అప్పగించేందుకు మార్గదర్శకాలు
- ఇప్పటివరకు మద్యంషాపుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఇంటికి
- ఆందోళనలో బాధిత ఉద్యోగులు
- ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన



పెనుగంచిప్రోలులోని ప్రభుత్వ మద్యం దుకాణం

పెనుగంచిప్రోలు/కంచికచర్ల: అధికారంలోకి వస్తే ఏటా నాలుగు లక్షల ఉద్యోగాల చొప్పున ఐదేళ్లలో 20లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన టీడీపీ కూటమి పెద్దలు..అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఇచ్చిన ఉద్యోగాల సంగతి దేవుడెరుగు... ఉన్న ఉద్యోగాలను మాత్రం ఊడగొడుతున్నారు. నూతన మద్యం పాలసీ పేరుతో ఇప్పటివరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సేల్స్‌మెన్లు, సూపర్ వైజర్లు, నైట్‌వాచ్‌మెన్ ఉద్యోగులే నిదర్శనం.

రోడ్డున పడుతున్న కుటుంబాలు..

జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో మొత్తం 32 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలన్నింటిలో కలిపి సేల్స్ మెన్లు, సూపర్‌వైజర్లు, నైట్‌వాచ్‌మెన్లుగా మొత్తం 156మంది ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ విధానంలో వీరిని ఎంపిక చేశారు. సేల్స్ మెన్లకు 21వేలు, సూపర్‌వైజర్లకు రూ.24,500, నైట్‌వాచ్‌మెన్లకు నెలకు జీతం రూ.10,700 అందజేస్తున్నారు. ఐదేళ్లుగా వీరంతా ఆయా ఉద్యోగాలు చేస్తున్నారు. గత మద్యం పాలసీని రద్దుచేసిన సీఎం చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీకి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దుచేయడంతోపాటు టెండర్ల విధానం ద్వారా మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేలా పాలసీ రూపొందించింది. అక్టోబర్ ఒకటోతేదీ నుంచి నూతన మద్యం పాలసీ అమలులోకి వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబంధించి విధివిధానాలతో కూడిన నోటిఫికేషన్ రావాల్సి ఉంది. పదిరోజుల్లో ఈ ప్రక్రియను పూర్తికానుందని సమాచారం. దీంతో మద్యం దుకాణాలు ప్రైవేట్ పరమవుతుండటంతో ఇప్పటివరకు జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఆయా సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు, నైట్‌వాచ్‌మెన్లు తమ ఉద్యోగాలను కోల్పోనున్నారు. దీంతో వారి కుటుంబాలు వీధినపడనున్నాయి. నూతన మద్యం పాలసీతో దుకాణాలన్నీ ప్రైవేట్ వ్యక్తులల చేతుల్లోకి వెళ్లిపోతే ఆయా దుకాణాల నిర్వహణలో వారు తమ మనుషులనే పెట్టుకుంటారు తప్ప వీరికి ఎటువంటి అవకాశం ఉండదు. దీంతో ఆయా మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నవారిని ప్రభుత్వమే ఇంటికి సాగనంపుతుండటంపై బాధిత ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాల్సిన ప్రభుత్వమే ఇలా ఉద్యోగాల నుంచి తొలగింపునకు కారణం కావడం ఏమాత్రం తగదని వారు విమర్శిస్తున్నారు.

చిరుద్యోగులపై ఎందుకీ కక్ష..

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో పలువురు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్లు, బుక్ కీపర్లు తదితర చిరుద్యోగులను తొలగించారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న చిరుద్యోగులను రాజకీయ కక్షసాధింపులో భాగంగా టీడీపీ కూటమి నాయకులు విధుల నుంచి తొలగించడంతో పాటు ఆస్థానంలో తమవారిని నియమించుకుంటుండటంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరెన్ని విమర్శలు చేసినా తమకు ఇష్టమొచ్చినట్లే చేస్తామనే పంథాలో టీడీపీ కూటమి నాయకులు ఇటువంటి దురాగతాలకు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగం తీసేయడం తగదు..



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో బాధ్యతగా విధులు నిర్వర్తించాం. విద్యార్హతల ఆధారంగానే ఉద్యోగావకాశాలు కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనిచేశాం. ప్రభుత్వ పాలసీల ఆధారంగా మమ్మల్ని అర్థాంతరంగా తొలగిస్తే మా పరిస్థితి ఏమిటి, ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి.

– యర్రంశెట్టి నాగబాబు, సూపర్‌వైజర్, పెనుగంచిప్రోలు

ఉద్యోగ భద్రత కల్పించాలి..



నూతన మద్యం పాలసీ పేరుతో ఉన్న ఉద్యోగాన్ని తొలగించడం సబబు కాదు. ఉన్న చిన్నపాటి ఉద్యోగం కూడా లేకపోతే ఎలా జీవనం సాగించాలి. ప్రభుత్వం మాకు ఉద్యోగ భద్రత కల్పించి మా కుటుంబాలను ఆదుకోవాలి.

– రేగండ్ల సైదులు, సేల్స్‌మెన్

అర్థాంతరంగా తొలగిస్తే ఎలా..



అవుట్‌సోర్సింగ్ విధానంలోనైనా ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందనే ఆశలో ఉన్న మాకు నూతన మద్యం పాలసీ షాక్ ఇచ్చింది. మా కుటుంబాలను రోడ్డున పడవేయకుండా ప్రభుత్వం పెద్ద మనస్సుతో ఆలోచించాలి. మమ్మల్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి.

– భీమవరపు సాయికుమార్, నైట్‌వాచ్‌మెన్, పెనుగంచిప్రోలు

వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులతో సమావేశం నేడు

జగ్గయ్యపేటఅర్బన్: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పూనూరి గౌతమ్‌రెడ్డి మంగళవారం జగ్గయ్యపేట పట్టణానికి రానున్నారు. వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఉదయం 10 గంటలకు ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు అవగాహన కల్పించేందుకు పార్టీ నియోజకర్గ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ముఖ్యనాయకులంతా ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు కోరారు.

వీఆర్వోలతో సమీక్ష

జుజ్జూరు(వీరులపాడు):వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండకపోతే సహించేదిలేదని తహసీల్దార్ రాజకిషోర్ హెచ్చరించారు. జుజ్జూరులోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఆయన మండలంలోని వీఆర్వోలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకిషోర్ మాట్లాడుతూ వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ రైతుల వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలతో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రెవెన్యూ రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పింఛన్‌దారులకు సచివాలయ సిబ్బంది మంగళవారం పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఉదయం ఆరుగంటల నుంచే సచివాలయ సిబ్బంది మండల గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌ను పంపిణీ చేస్తారని జగ్గయ్యపేట ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు .

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి



శనగపాడు(పెనుగంచిప్రోలు): ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎంఈఓ డి.రవీంద్ర సూచించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎస్‌వీఎం కుమారి పదవీవిరమణ సత్కార సభను సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు కుమారి 39ఏళ్లుగా విశేష సేవలందించారని కొనియాడారు. అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులను విద్యార్థులు ఎప్పటికీ మరచిపోరన్నారు. సత్కారగ్రహీత కుమారి మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన విద్యాశాఖ అధికారులు, తోటి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పాల్‌రాజ్, ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, కుమారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పెనుగంచిప్రోలు: మండలంలోని తోటచర్ల గ్రామంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లతో స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు వ్యక్తులను ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్ సోమవారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సరిహద్దు చెక్‌పోస్టుల పరిశీలన

జగ్గయ్యపేట: మండలంలోని అన్నవరం, బలుసుపాడు గ్రామాల వద్దనున్న సరిహద్దు చెక్‌పోస్టులను చిల్లకల్లు ఎస్‌ఐ తోట సూర్యశ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పరిశీలించినట్లు తెలిపారు. రాత్రివేళల్లో ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న చెక్‌పోస్టును తెలంగాణ, ఏపీ సరిహద్దు ప్రాంతాలలో మార్పు చేస్తున్నామని తెలిపారు. బూదవాడ చెక్‌పోస్టును కూడా ఎస్‌ఐ పరిశీలించారు.

అధ్వానంగా శివాపురం రహదారి



శివాపురం(పెనుగంచిప్రోలు): మండలంలోని శివాపురం గ్రామంలో ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారింది. పైపులైన్ లీక్‌లతోపాటు మురుగు నీరు అంతా రహదారిపై ప్రవహించటంతోపాటు పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో నీరు చేరటంతో ప్రమాదాలకు గురై పలువురు వాహనదారులు గాయాలపాలయ్యారు. తక్షణం ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని శివాపురం గ్రామస్తులు కోరుతున్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



జగ్గయ్యపేట అర్బన్: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని జగ్గయ్యపేట నియోజకవర్గం దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావు రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు సోమవారం విజయవాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సృజనను కలసి వినతిపత్రాన్ని అందజేసినట్లు ఆయన వివరించారు. దివ్యాంగులందరికి అంత్యోదయ అన్నయోజన కార్డులు అందజేయాలని, దివ్యాంగులకు 300 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందజేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలని, భర్త, భార్య దివ్యాంగులుగా ఉన్న కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్నారు. రైతుబజార్లలో దివ్యాంగులకు స్టాల్స్ కోటా పెంచాలని, దివ్యాంగులకు నివేశనస్థలాలు, గృహ నిర్మాణ పథకం అమలు చేయాలని, అన్ని శాఖల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరినట్లు ఉమామహేశ్వరరావు వివరించారు.

బాధితుల వివరాలు నమోదు


చెవిటికల్లులో వివరాలు సేకరిస్తున్న కార్యదర్శి రవికుమార్

కంచికచర్ల : కృష్ణానది, మున్నేరు నదీతీర గ్రామాల్లో వరదకు ముంపునకు గురైన గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీ అధికారులు సోమవారం రీ ఎన్యూమరేషన్ చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ సృజన ఆదేశాల మేరకు మూడు రోజులుగా కొనసాగుతున్న రీఎన్యూమరేషన్ ప్రక్రియలో భాగంగా రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఆయా గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. మున్నేరు, కృష్ణానది తీర పరివాహక గ్రామాలైన మండలంలోని కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, మోగులూరు, మున్నలూరు, కునికెనపాడు, ఎస్. అమరవరం, పెండ్యాల, వేములపల్లి గ్రామాల్లో ఇళ్లలోకి వరదనీరు చేరగా బాధితులకు పరిహారం మాత్రం అందలేదు. దీంతో బాధితులు ఆందోళన వ్యక్తంచేశారు. మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ముంపు గ్రామాల్లో పర్యటించారు. బాధితులకు పరిహారం అందించాలని కోరుతూ ఆర్డీవో రవీంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. బాధితులను రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పక్కనే ఉన్న మైలవరం నియోజకవర్గంలో వరద ముంపు బాధితులకు అందుతున్న నష్టపరిహారం కంచికచర్ల మండలంలోని ముంపు గ్రామాలకు ఎందుకు అందదని బాధితులు డిమాండ్ చేశారు. చెవిటికల్లులో ఏకంగా గ్రామసచివాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో ఏటిపట్టు గ్రామాల్లో అధికారులు రీసర్వే చేపట్టారు. మూడు రోజుల నుంచి వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను నమోదు చేస్తున్నారు. సర్వేను త్వరితగతిన పూర్తిచేసిన పరిహారాన్ని అందించాలని బాధితులు కోరుతున్నారు.

విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళన ఉధృతం

నందిగామ టౌన్: మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్ హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగించటాన్ని నిరసిస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట బాధితులతో కలిసి సోమవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23ఏళ్లుగా ఎటువంటి ఆరోపణలు, వివాదాలు లేకుండా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం తగదన్నారు. చిరుద్యోగులను విధుల నుంచి తొలగించడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. రాజకీయ కక్షతోనే వారిని తొలగించారన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదని అవసరమైతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గోపీనాయక్, ఏసోబు, కళావతి, సత్యవతి, బాధిత మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఐదుగురికి ఏడాదిపాటు జైలు

జగ్గయ్యపేట: ఘర్షణ కేసులో ఐదుగురికి ఏడాదిపాటు జైలుశిక్ష విధిస్తూ జగ్గయ్యపేట న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు చిల్లకల్లు ఎస్సై తోట సూర్యశ్రీనివాస్ సోమవారం రాత్రి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు..మండలంలోని గౌరవరం గ్రామానికి చెందిన గుంజా గురుస్వామి తనపై ఐదుగురు వ్యక్తులు దాడిచేసినట్లు 2021 మార్చి 26న పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై జి.మహాలక్ష్మణుడు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి కోర్టులో మూడేళ్లపాటు విచారణ కొనసాగింది. ఇరుపక్షాల వాదోపవాదనలు ముగియడంతో నేరం రుజువైనందున గౌరవరం గ్రామానికి చెందిన వల్లెపు సాయికృష్ణ, వాణి, నాగలక్ష్మి, రాంబాబు, వెంకటేశ్వర్లకు ఏడాదిపాటు జైలుశిక్ష విధిస్తూ జగ్గయ్యపేట న్యాయమూర్తి ఎం.శోభారాణి సోమవారం తీర్పునిచ్చారు. కేసు పరిష్కారానికి కృషి చేసిన ఎస్సై మహాలక్ష్మణుడును ఉన్నతాధికారులు అభినందించారు.

జీతాలు ఇవ్వాలని డీఆర్‌ఓకు వినతి


డీఆర్‌ఓకు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న శానిటరీ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు విజయవాడలో జిల్లా డీఆర్‌వో శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న శానిటరీ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులకు కాంట్రాక్టర్ కృష్ణప్రసాద్ నాలుగునెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. దీంతో వర్కర్లు, సెక్యూరిటీగార్డుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయన్నారు. వీరికి వారాంతపు సెలవులు కూడా అమలు కావడం లేదని, అనారోగ్యం, అత్యవసర పరిస్థితుల్లో సెలవు పెడితే వేతనం కట్‌చేస్తున్నారని డీఆర్‌ఓకు వివరించారు. వెంటనే జీతాలు ఇప్పించి చిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, కమల, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు ముమ్మరంగా ఏర్పాట్లు



కంచికచర్ల పశువుల ఆసుపత్రి, ఫైర్‌స్టేషన్ రోడ్లలో ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్లు

కంచికచర్ల : దసరా ఉత్సవాలను కంచికచర్ల మండలంలోని ఆలయాలను భక్తులు ముస్తాబు చేస్తున్నారు. కంచికచర్ల శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ప్రతిఏటా వైభవోపేతంగా నిర్వహిస్తుంటారు. ఈసారి కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా చలువ పందిళ్లతోపాటు విద్యుత్‌దీపాలంకరణ చేస్తున్నారు. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు నిత్యం వందలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక ఆలంకరణలో కొలువుదీరే అమ్మవారిని దర్శించుకుంటారు.

ఈనెల 3నుంచి శరన్నవరాత్రులు...

ఈనెల అక్టోబర్ 3వ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. అందులో భాగంగా తొలిరోజు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి రజిత కవచ అలంకారంతో దర్శనమివ్వనున్నారు. 4వతేదీన బాలా త్రిపురసుందరీదేవి, 5న గాయిత్రీదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న లలితా త్రిపుర సుందరీదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి(మూలానక్షత్రం), 10న దుర్గాదేవి, 11న మహిషాషుర మర్దినిదేవి, 12న రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. 13న బతుకమ్మ అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని కంచికచర్ల వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ అర్చకులు తారంబాబు తెలిపారు.

ఎఫ్‌డీపీతో ఎంతో ఉపయోగం



అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ కార్యక్రమంలో పాల్గొన్న విభాగాధిపతులు, అధ్యాపకులు

కంచికచర్ల : పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సీఎస్‌ఈ ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) సోమవారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టెక్ మహేంద్ర సౌత్ ఇండియా హెచ్‌ఆర్ హెడ్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వినియోగంలో ఉన్న లేటెస్ట్ ట్రెండ్‌ను గుర్తించి విద్యార్థులకు అవసరమైన సాంకేతిక విద్యను అందించాలని అధ్యాపకులకు సూచించారు. ఇండస్ట్రీకి అవసరమైన సాంకేతిక విద్యను విద్యార్థులకు ఏవిధంగా బోధించాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహణ అధ్యాపకులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగమమని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ ఏపీసీటీఈ ఏటీఏఎల్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ జీ విజయకుమార్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్ కె.సుభాస్‌చంద్ర, అన్ని విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదేశించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, కమిటీ చైర్మన్ తాతయ్య మాట్లాడుతూ ఆస్పత్రికి కావలసిన సదుపాయాలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కమిటీ కన్వీనర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆళ్ల హరీష్ మాట్లాడుతూ అజెండాలోని అంశాలను కమిటీకి నివేదించారు. సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు యలమంచిలి వెంకటలక్ష్మి, పద్మనాభుని కుటుంబరావు, గుడిసె నాగేశ్వరరావు, టీడీపీ పట్టణ ప్రధానకార్యదర్శి మైనేని రాధా, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో భగ్గుమన్న విబేధాలు

జి.కొండూరు: వినాయకుడి ఊరేగింపు సాక్షిగా టీడీపీ నాయకులు చేసిన రచ్చ జి.కొండూరులో చర్చనీయాంశమైంది. హిజ్రాలతో డ్యాన్సులు, డీజేలలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, తీన్మార్ స్టెప్పులు, ఈలలు, కవ్వింపు చర్యలు ఇలా ఆదివారం రాత్రి జి.కొండూరులో జరిగిన అలజడి గ్రామస్తులను తీవ్ర భయాందోళనకు గురి చేసింది. ఫలితంగా పోలీసులు నియంత్రించేందుకు చేసిన ప్రయత్నం రాజకీయ మలుపునకు కారణమైంది. హిజ్రాల డ్యాన్సులు, డీజేలను ఆపినందుకు టీడీపీ నాయకులు, యువకులు జైజై దేవినేని ఉమా, డాన్ డాన్ కేపీ అంటూ జి.కొండూరు గుడి సెంటర్‌లో చేసిన హంగామా రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది.

చేతులెత్తేసిన పోలీసులు..

జి.కొండూరులో టీడీపీలో వర్గ విబేధాలు తారాస్థాయికి చేరాయి. పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆధిపత్యం ప్రదర్శించేందుకు ఎవరికి వారు వారి స్థాయిలో నానా తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు, యువకులు జి.కొండూరు చెరువు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. డీజేలలో పవన్ కల్యాణ్ గతంలో వైఎస్సార్ సీపీ నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్లే చేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీనితో వివాదం ముదిరి గొడవకు దారితీసే అవకాశం ఉన్నందును నందిగామ ఏసీపీ రంగంలోకి దిగారు. సమీప పోలీసుస్టేషన్ల నుంచి సిబ్బందిని రప్పించి డీజేలను ఆపించి ఊరేగింపు జరుపుకోవాలని చెప్పారు. దీనితో రెచ్చిపోయిన టీడీపీ నాయకులు, యువకులు జి.కొండూరు గుడి సెంటర్‌లో అర్ధరాత్రి నిరసనకు దిగారు. డాన్ డాన్ వసంత, జైజై దేవినేని ఉమామహేశ్వరరావు అంటూ నినాదాలు చేశారు. అంతటితో ఆగకుండా ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తుంది. టీడీపీ నాయకులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున చేరి డీజేకి అనుమతిస్తేనే నిరసన ఆపుతామని హెచ్చరించారు. ఈ క్రమంలో టీడీపీలో అక్కడే ఉన్న రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. గొడవ తీవ్రం కావడంతో పోలీసులు చేసేదిలేక డీజేకి అనుమతిచ్చారు. ఊరేగింపులో జరిగిన గందరగోళంలో ఐదుగురు వ్యక్తులు తనని చంపుతామని బెదిరిస్తూ తనపై దాడికి యత్నించారంటూ టీడీపీ నాయకుడు పజ్జూరు జగన్ పోలీసులుకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

జాతీయ సమైక్యతను చాటిన ప్రదర్శనలు


మొగల్రాజపురం సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాలలో నృత్యాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

విజయవాడ కల్చరల్: తళుకు బెళుకుల స్వరరాగాలు , యువతీ యువకుల కేరింతలు, బాల బాలికల ఆనందోత్సాహాలు వెరసి పీబీ సిద్ధార్థ విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు సిద్ధార్థ నృత్యోత్సవం 2024 పేరిట మొగల్రాజపురంలోని కళాశాలలో సోమవారం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, భక్తిగీతాలతోపాటు పలు అంశాలు ఆసక్తిరంగా సాగాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కూచిపూడి, తమిళనాడుకు చెందిన భరతనాట్యం, కేరళకు చెందిన మోహినీ అట్టం, మహారాష్ట్ర, బెంగాల్ రాష్ట్రాకు చెందిన సంప్రదాయ నృత్యాలను విద్యార్థులు మనోహరంగా ప్రదర్శించి జాతీయ సమైక్యతను చాటారు. సిద్ధార్థా కళాశాల అనుబంధ కళాశాలలైన నర్సింగ్ కళాశాల, మహిళా కళాశాల, వైద్య కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల చెందిన విద్యార్థులు 125 మంది వివిధ అంశాలను ప్రదర్శించారు. విద్యార్థులకు కళాపీఠం పక్షాన అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. నృత్యోత్సవంలో కళాపీఠం అధ్యక్షుడు పి.లక్ష్మణరావు, కళాపీఠం ప్రధాన కార్యదర్శి ఎస్.లలిత్ ప్రసాద్ పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌కు ఘనసత్కారం


బాలాజీనాయక్‌ను సత్కరిస్తున్న బద్దూనాయక్, గోర్‌బాయ్ సంఘ సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ సోమవారం ఉద్యోగవిరమణ పొందిన జె.బాలాజీ నాయక్‌ను కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి, గోర్‌బాయ్ సేవాసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు లాహోరి బద్దూనాయక్ మాట్లాడుతూ సబ్‌రిజిస్ట్రార్‌గా జె.బాలాజీనాయక్ సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఎటువంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించి మంచిపేరు తెచ్చుకున్న ఆయన సేవలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎంఈవో ఎల్.చిట్టిబాబు, మాజీ సబ్‌రిజిస్ట్రార్ బి.రాజునాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు నాయక్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ లాహోరి బాలమ్మ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.